

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 224 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం, 14, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# రాజకీయ విలువలను.. దిగజార్చకండి !

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- రాజకీయాల్లో వ్యక్తిగత స్వార్థాలకే విలువ ఎక్కువ
- ప్రజా సమస్యలపై పట్టింపు లేకుండా పోతుంది
- నిండు చట్ట సభల్లో అంబర్లు తినే స్థాయికి దిగజారిపోయాయి
- అసెంబ్లీ సభలలో దిగజారుడు సంభాషణ నడుస్తున్నాయి
- దేశంలోని విపత్తు కాలాలపై పోరాటాలు ఎక్కడ
- పవిత్రమైన పార్లమెంట్ అసెంబ్లీ భవనాలను అపవిత్రం చేస్తున్నారు
- రాజకీయాల్లో పూర్వ వైభవం పూర్తిగా కొరవడింది
- పార్లమెంట్ అసెంబ్లీలలో ఎంత మొత్తుకున్నా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు
- ప్రజలకు విలువనిచ్చే నాయకులు కరువు అవుతున్నారు.
- ప్రజా ప్రయోజనార్థం ప్రతి నాయకుడు ఎంత మేర పని చేస్తున్నాడు : డాక్టర్ బరిగెల శివ.

రాజకీయాల్లో నైతిక విలువలు, జవాబుదారీతనం క్రమంగా కనుమరుగవుతున్నాయని జై భీమ్ ఉద్యమ నాయకుడు డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉండాల్సిన పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీల్లో వ్యక్తిగత విమర్శలు, ఘర్షణలు, రాజకీయ ఆరోపణలే ఎక్కువవుతున్నాయని అన్నారు. నిత్యావసర ధరల పెరుగుదల, ఉపాధి, రైతుల సమస్యలు, పేదల సంక్షేమం వంటి కీలక అంశాలపై చర్చలు తగ్గిపోతున్నాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు వినిపించే అవకాశం ఉండాల్సిందేనని, చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని పేర్కొన్నారు. ప్రజల పన్ను ధనాన్ని ప్రజా సంక్షేమానికే వినియోగించాలని, పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయాల్లో ప్రజాసేవా దృక్పథం, పారదర్శకత, నైతికత పునరుద్ధరించబడితేనే ప్రజల విశ్వాసం బలపడుతుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2





## వికలాంగురాలికి అండగా మంత్రి

వినతిపత్రం అందగానే సమస్యపై వెంటనే స్పందించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశాలు

సమస్యను సానుభూతితో విని ధైర్యం చెప్పిన మంత్రి

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం

మంత్రి స్పందనకు బాధితురాలు, ప్రజల నుంచి ప్రశంసలు



2

## కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి

మెట్రో, ట్రిపుల్ ఆర్ తదితర అంశాలపై అనుమతులు రాబట్టాలి

ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ

ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు

సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు




5

## పోర్నోగ్రఫీ నియంత్రణపై పిల్.. కోర్టు పరిధిలోకి రాదన్న సుప్రీం

**న్యూఢిల్లీ,జులై13(జై భీమ్ న్యూస్):** దేశవ్యాప్తంగా పోర్నోగ్రఫీ నియంత్రణకు ప్రత్యేక జాతీయ విధానం రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. మైనర్లను అశ్లీల కంటెంట్ ప్రభావం నుంచి రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జాతీయ పాలసీని తీసుకురావాలని పిటిషనర్ చేసిన విజ్ఞప్తిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసు విచారణ సందర్భంగా అశ్లీల కంటెంట్ నియంత్రణ, దానికి సంబంధించిన విధానాల రూపకల్పన వంటి అంశాలు కోర్టుల పరిధిలోకి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తరహా నిర్ణయాలు తీసుకోవడం పూర్తిగా ప్రభుత్వం, పార్లమెంట్, చట్టసభల అధికార పరిధిలోని అంశమని ధర్మాసనం పేర్కొంది. ప్రజాప్రయోజన అంశాలపై కోర్టులు అవసరమైన సందర్భాల్లో జోక్యం చేసుకోగలిగినప్పటికీ, కొత్త విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం న్యాయవ్యవస్థ బాధ్యత కాదని అభిప్రాయపడింది. విధాన నిర్ణయాల విషయంలో కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల అధికారాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

## షాబాద్ నర హంతకుడు రాజ్‌కుమార్ మృతి

కొత్తూరు మండలం పంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యం..

పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు

రాజ్‌కుమార్ మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం

మేనమామ ఊరిలో ఆత్మహత్యకు పాల్పడ్డ రాజ్‌కుమార్..

షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని చంపిన రాజ్‌కుమార్



2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# షాబాద్ నర హంతకుడు రాజ్‌కుమార్ మృతి

**కొత్తూరు మండలం పంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యం..**
**పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు**
**రాజ్‌కుమార్ మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం**
**మేనమామ ఊరిలో ఆత్మహత్యకు పాల్పడ్డ రాజ్‌కుమార్..**
**షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని చంపిన రాజ్‌కుమార్**

రంగా రెడ్డి జిల్లా పెంజర్ల (జై భీమ్ క్రైమ్ న్యూస్)



తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన షాబాద్ ఆరుగురి హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం కొత్వాల్ మండలం పెంజర్ల గ్రామ సమీపంలో నిందితుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కనే విషపు సీసా లభ్యమవడంతో అతను బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. గతంలో తనపై ( పోక్సో ) కేసు పెట్టిన మైనర్ బాలిక కుటుంబంపై కక్ష పెంచుకున్న రాజ్ కుమార్, ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు. శుక్రవారం రాత్రి షాబాద్‌లోని సదరు బాలిక ఇంటికి వెళ్లిన నిందితుడు.. తొలుత బాలిక తల్లి లక్ష్మి (42), అమ్మమ్మ రుక్కమ్మ (60)లను కత్తితో కిరాతకంగా నరికి చంపాడు. అనంతరం మైనర్ బాలికను బలవంతంగా కారులో దైవలగూడ శివార్లలోని చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతుకోసి హతమార్చాడు. బాలిక కుటుంబాన్ని అంతం చేసిన అనంతరం.. నిందితుడు తన స్వగ్రామానికి చేరుకుని సొంత భార్య సరిత (30), నాలుగేళ్ల కుమారుడు, ఏడాదిన్నర వయసున్న మరో చిన్న కుమారుడిని సైతం అదే రీతిలో అత్యంత దారుణంగా చంపేశాడు. ఆ తర్వాత తన తండ్రికి ఫోన్ చేసి, "రెండు కుటుంబాల కథ ముగించాను, నేను కూడా చనిపోతున్నా" అని చెప్పి మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. ఘటన అనంతరం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుడి కోసం ముమ్మరంగా వేట కొనసాగుతున్న తరుణంలోనే, సోమవారం పెంజర్ల పొలాల్లో రాజ్ కుమార్ శవమై తేలడంతో ఈ దారుణ ఉదంతం విషాదాంతంగా ముగిసింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి




ఐనవోలు : (జై భీమ్ న్యూస్)

ఎస్ఐఆర్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అని బిజెపి మండల ఎస్ఐఆర్ కన్వీనర్ ఆడెపు విక్రమ్ పిలుపునిచ్చారు. సోమవారం వర్ధన్నపేట కన్వీనర్ కొండేటి శ్రీధర్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో ఐనవోలు, కొండపర్తి, ముల్కల గూడెం,ఒంటిమామిడిపల్లి గ్రామపంచాయతీలలో ఎలక్షన్ బూతులలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆడేపు విక్రమ్ మాట్లాడుతూ...సమగ్ర ఓటు సర్వే తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న వేళ గ్రామ గ్రామాన ఎస్ఐఆర్ పై ప్రజల్లో అవగాహన పెరిగిందని,అర్హులైన ఒక్క ఓటర్ కూడా వారి ఓటు కోల్పోయే అవకాశం లేదని భరోసా ఇచ్చారు.ప్రతి బూత్ లెవెల్ ఆఫీసర్ లు గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు,రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో ప్రతి ఓటర్ కూడా సర్వేలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల శక్తి కేంద్రం ఇంచార్జ్ లు కోట.కిరణ్, దొణికెల.వెంకటేష్,గుండెబోయిన వెంకటేష్ గౌడ్ ఆయా గ్రామాల బిఎల్ఓలు, ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చాటిన వరంగల్ ట్రాఫిక్ పోలీసులకు ఘన సన్మానం

వరంగల్, 13 జూలై 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)

తెలంగాణ 5వ రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో విశిష్ట ప్రతిభ కనబర్చిన వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని సోమవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ కె. సుజాత విజేతలకు శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ క్రీడా పోటీల్లో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఎస్. అజయ్ బాడీ బిల్డింగ్ విభాగంలో సిల్వర్ మెడల్, రెజ్లింగ్ విభాగంలో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే వాషి జమునారాణి బాక్సింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ శాఖకు గౌరవాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోటీ తత్వం మరింత పెంపొందుతాయని అన్నారు. ఇలాంటి విజయాలు పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచుతాయని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించి శాఖకు మరింత పేరు తీసుకురావాలని విజేతలను అభినందించారు. ట్రాఫిక్ సీఐ కె. సుజాత మాట్లాడుతూ, క్రీడల్లో సాధించిన ఈ విజయాలు ఇతర పోలీసు సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని విజేతలను ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విజేతల విజయంతో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ శాఖలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.




# రాజకీయ విలువలను దిగజార్చకండి

**రాజకీయాల్లో వ్యక్తిగత స్వార్థాలకే విలువ ఎక్కువ.**
**ప్రజా సమస్యలపై పట్టింపు లేకుండా పోతుంది.**
**నిండు చట్ట సభల్లో అంబర్లు తినే స్థాయికి దిగజారిపోయాయి.**
**అసెంబ్లీ సభలలో దిగజారుడు సంభాషణ నడుస్తున్నాయి.**
**దేశంలోని విపత్తు కాలాలపై పోరాటాలు ఎక్కడ.**
**పవిత్రమైన పార్లమెంట్ అసెంబ్లీ భవనాలను అపవిత్రం చేస్తున్నారు.**
**రాజకీయాల్లో పూర్వ వైభవం పూర్తిగా కొరవడింది.**
**పార్లమెంట్ అసెంబ్లీలలో ఎంత మొత్తుకున్నా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు.**
**ప్రజలకు విలువనిచ్చే నాయకులు కరువు అవుతున్నారు.**
**ప్రజా ప్రయోజనార్థం ప్రతి నాయకుడు ఎంత మేర పని చేస్తున్నాడు : డాక్టర్ బరిగెల శివ.**

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రాజకీయ పలుకుబడిని దిగజార్చే పనులు చేయకూడదని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.రాజకీయాల్లో జవాబుదారీతనం పూర్తిగా కొరవడుతుందని నిలదీశారు.ప్రభుత్వాలు అంటే ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తూ పేద ప్రజలకు సహాయార్థంగా పాలన చేయాల్సింది పోయి దేశవ్యాప్తంగా పేద ప్రజలు అల్లాడుతుంటే నిత్యవసరాల ధరలను ఆకాశానికి చేరే విధంగా పెంచుతూ సామాన్య వర్గాలపై ఆర్థిక భారాన్ని పెంచుతున్నారని విమర్శించారు.నాయకుల వ్యక్తిగత వ్యాపారాలపై వ్యాపారస్తులపై ఉన్న శ్రద్ధ ప్రజాసేవపై లేకపోవడం రాజకీయ విలువలను దిగజారుస్తున్నట్లుగా ఉందని అభిప్రాయపడ్డారు.ఎక్కడ చూసినా రాజకీయ పలుకుబడి కోసం మాత్రమే రాజకీయ నాయకులు గాబర పడుతున్నారు తప్ప ప్రజలను మోసగించడంలో ఆరితేరిపోతూ ప్రభుత్వాల పేరు చెప్పి ప్రజలను పేరుపేరునా ప్రలోభాలకు గురి చేస్తూ మోసం చేస్తున్నారని హెచ్చరించారు.దేశవ్యాప్తంగా పార్లమెంటులో గాని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో గాని ప్రజలను అభివృద్ధిపరిచే సమావేశాల చర్చలు పూర్తిగా తగ్గిపోయాయని ఆర్థిక భారాన్ని ప్రజలపై రుద్ది పార్లమెంట్ చట్టాలకు అసెంబ్లీ చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వాల ఆర్థిక బడ్జెట్ బిల్లులను ప్రవేశపెడుతున్నారని క్షేత్రస్థాయిలో విమర్శించారు.ప్రజల ఆలోచనలకు ప్రభుత్వాల పాలనకు సరితూగని విధంగా రాజకీయ నాయకుల వ్యక్తిగత అభివృద్ధిని మాత్రమే బలపరుచుకుంటూ ప్రజాసేవను విస్మరిస్తున్నారని తెలిపారు. 2014లో కేంద్రంలో అధికారంకొచ్చిన బిజెపి ప్రభుత్వం సుదీర్ఘమైన కాలం పాటు దేశాన్ని పాలిస్తూ ఉంటుండగా దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంత మేరకు నెరవేర్చారు అనేది ఏ ఒక్కరు అడగలేకపోతున్నారని పైగా ప్రభుత్వాలను గాని నాయకులను గాని ప్రశ్నిస్తున్న సందర్భాల్లో తీవ్రమైన అణిచివేతను కొనసాగిస్తున్నారని దాని ప్రభావం ప్రజాస్వామ్య విలువలపై పెద్ద ఎత్తున పడుతుందన్నారు.నోట్ల రద్దుతో దేశం లోని ఆర్థికమాన్యం చిన్న భిన్నమైపోగా దేశ ప్రజలు ఎటు తేల్చుకోలేని స్థితిలో ఆర్థిక ఇబ్బందులతో లెక్కలేనంతమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు.రాత్రికి రాత్రి నోట్ల మార్పిడి చట్టం రూపంలో వెలుగొందడంతో దేశ ప్రజలు దిక్కుతోచని స్థితిలోనికి వెళ్లిపోయారన్నారు.మేక్ ఇన్ ఇండియా పై ఇప్పటివరకు కనీసం సూచనాభిప్రాయమైన అభివృద్ధి కూడా జరగలేదనేది వాస్తవమన్నారు.బ్లాక్ మనీ తిరిగి తెస్తూ 15 లక్షల రూపాయల చొప్పున దేశ ప్రజల అకౌంట్లో జమ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరకపోగా దేశంలో బడా వ్యాపారస్తులు అందరూ ప్రపంచంలోని ఇతర దేశాలలో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసుకునే స్థాయికి ఎదిగారని అదంతా కేవలం కేంద్ర ప్రభుత్వం సహకారం కేంద్ర ప్రభుత్వం చొరవతో మాత్రమే జరుగుతుందని తెలిపారు.దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య ఇంధన ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత లేని వైఖరితో ప్రజలను అరిగోస పెడుతుందని గుర్తు చేశారు.విమర్శకులకు తావిచ్చే విధంగా దేశవ్యాప్తంగా ఇంధన వ్యాప్తి పై పెరుగుతున్న ధరలను చూసి పేద ప్రజలు ఎలా జీవించాలో అర్థం కావడం లేదన్నారు.పైగా అన్ని రాష్ట్రాలలో ఇంధనం ధరల పెరుగుదల వల్ల సామాన్యులైన పేద ప్రజలు, కడుపేద స్థితిని అనుభవిస్తున్న రైతులు మాత్రమే లెక్కలేనన్ని ఇబ్బందులు పడుతున్నారని వాటి భారాన్ని ప్రతి రాష్ట్రంలోని ప్రభుత్వం ఛాలెంజ్గా తీసుకొని ఇంధనాల ధరల పెంపు నియంత్రణకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.

**ప్రజల హక్కుల పైనే మా పోరాటం.**

భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కరుడుగట్టిన పేదరికాన్ని అనుభవించి ఎంతో ఎత్తుకు ఎదిగిన విధానం రాజకీయ నాయకులు జ్ఞాపకం చేసుకోవాలని గుర్తు చేశారు.ప్రజా సమస్యల పైన పోరాటం చేస్తే రాజకీయ విలువలను దిగజార్చుకుంటూ కేసులు కట్టే పద్ధతిని పూర్తిగా నిర్మూలించబడాలన్నారు.సుప్రీం కోర్ట్ నియమాలు భారత రాజ్యాంగ హక్కులు దేశంలోని ప్రజలందరికీ ప్రశ్నించే హక్కు నిలదీసే హక్కు తప్పులపై పోరాటాలు చేసే హక్కులు చట్టాల రూపంలో కల్పించబడగా రాజకీయంలో ఉన్న వ్యక్తులు అధికారాల్లో ఉన్న వ్యక్తులు పోరాటదారులపై పోటీపడి కక్ష సాధింపు చర్యలతో రెచ్చిపోతున్నారని మండిపడ్డారు.ప్రజలకు సేవ చేయాల్సిన చట్టసభలను వ్యక్తిగతమైన అవసరాల కోసం వాడుకోవడం అలాంటి నాయకులు రాజకీయ అసమర్థతకు సరితూగే వాళ్ళుగా గుర్తించబడుతుందన్నారు.ప్రజల హక్కులపై పోరాటం చేయాలంటే సాహసవంతమైన గుర్తింపు తెచ్చుకోవాలని అలాంటివన్నీ ధైర్య సాహసాలు కలిగిన వ్యక్తులకు మాత్రమే సాధ్యమైతాయని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రజలు క్లిష్టమైన పరిస్థితిలో జీవన విధానాలను కొనసాగిస్తున్నారని వాళ్ళందరూ కేవలం ప్రభుత్వాలు కల్పించే సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించే ఆర్థిక వనరులపై ఏమాత్రం ఆశపడకుండా స్వతహాగా వాళ్ల జీవితాలను జీవించుకొనివ్వకుండా ప్రజలపై క్రూరమైన స్వభావాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వాలు అధికారంలోనికి రావడానికి ప్రజల సహకారం ప్రజల ఓట్లు ఎంత అవసరమో అధికారంలోనికి వచ్చిన ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాపాడడం అంతే అవసరమని ప్రజల హక్కులను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాలు దీర్ఘకాలిక మూల్యాలను చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.ప్రజావిశ్వాసంతో సంబంధం లేకుండా చట్టసభలను నడిపించడం రాజకీయ అవివేకంగా భావించాల్సి ఉంటుందన్నారు.పార్లమెంట్ గాని అసెంబ్లీ లాంటి భవనాలు నిరూపితమైనదే ప్రజల హక్కులను రక్షించడానికి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి అనే విషయాన్ని నేటి రాజకీయ పాలకులు పూర్తిగా మర్చిపోతున్నారని గుర్తు చేశారు.

**దరిదాపుల్లో లేని ధరల పెంపు నియంత్రణ.**

ప్రజలను నిరంతరం మోసగిస్తూ పేద ప్రజల జీవితాలపై పిడుగు లాంటి ఆర్థిక భారాలను వేస్తూ పేద ప్రజలు నిత్యావసరాల కోసం వాడుకుంటున్న ప్రతి వస్తువుపై లెక్కలేనంత రుసుమును పెంచుతూ విదేశాలపై నెడుతుండడం పూర్తి తప్పుగా భావించాలన్నారు.దేశంలో లభ్యమయ్యే అత్యవసరాల వస్తువులన్నీ ఇతర దేశాలపై దిగుమతులు చేసుకుంటున్నామంటూ యుద్ధం ముగిసి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ యుద్ధ ప్రభావం ఏ దేశం మీద లేనిది కేవలం భారతదేశం మీద ప్రభావం చూపిస్తున్నట్లుగా దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులపై నిత్యావసరాల ధరల పెంపు అనే భారాన్ని వేసి ప్రజల జీవితాలతో చెలగాటాలాడుతున్నారని తీవ్రంగా విమర్శించారు.ప్రభుత్వాలకు ప్రజలు చెల్లిస్తున్న పన్నులను ప్రజల ఆర్థిక అవసరాల కోసం ఉపయోగిస్తున్న ప్రభుత్వాలు వాళ్ల జవాబుదారీతనాన్ని ప్రదర్శించడం కోసం పార్లమెంటు సభల్లో గానీ అసెంబ్లీ సభల్లో గాని ప్రజలకు ఇస్తున్న హామీల ప్రకారం ప్రజల సొమ్మును ప్రజలకు ఖర్చు చేస్తూ దేశవ్యాప్తంగా పెంచబడుతున్న నిత్యవసరాల ధరలపై తక్షణమే వెనక్కి తగ్గాలని ఉన్నపాటుగా పేద ప్రజలు ఉపయోగించుకుంటున్న నిత్యవసరాలు ధరలు అన్నిటిని తగ్గించాలని డిమాండ్ చేశారు.పారిశ్రామికవేత్తల నుండి వ్యాపారస్తుల నుండి వాళ్ల వాళ్ల స్థాయికి తగ్గ పన్నులను, ఐటీలసొమ్మును వసూలు చేస్తూ పేద ప్రజలకు పంచాలని సూచించారు.వ్యాపారస్తులు, వ్యాపారవేత్తలు,లక్షల కోట్ల ఆస్తులకు ఎదుగుతున్నారని కేవలం అదంతా ప్రభుత్వాల చలవేనంటూ పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులలో పేద ప్రజలపై పన్నుల భారం గాని,ఆర్థిక భారం గాని పడకుండా సంపన్నుల వ్యాపారాలపై పెంచుతున్న పన్నులను వాటి ద్వారా వస్తున్న ఆర్థిక లాభాలను పేద ప్రజల సహాయార్థం ఉపయోగించాలని సూచించారు.ప్రతి రాష్ట్రంలో అత్యంత ధనవంతుల జాబితాలను వెలుగులోనికి తెచ్చి వాళ్ళు సంపాదిస్తున్న అక్రమ సొమ్మంతటిని చట్టపరంగా న్యాయపరంగా ప్రభుత్వాల పరం చేసుకుంటూ పేద ప్రజలకు సహాయపడాలని పేర్కొన్నారు.పేద ప్రజలే టార్గెట్ గా పనిచేసే ప్రభుత్వాలు గానీ రాజకీయ నాయకులు గానీ నిజాయితీని తప్పుకొని పనిచేస్తున్నట్లుగా ప్రజలు భావిస్తారని గుర్తు చేశారు.

**రాజకీయాల్లో కొరవడుతున్న జవాబుదారితనం.**

దేశం మొత్తంలో వేల సంఖ్యలో ఉన్న రాజకీయ నాయకులు ఎంపీలుగా కొనసాగుతున్న,శాసన సభ్యులుగా కొనసాగుతున్న, మంత్రులుగా కొనసాగుతున్న, కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్న, ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న, ప్రధానమంత్రిగా కొనసాగుతున్నప్పటికీ ఐదు సంవత్సరాల పదవి కాలంలో రాజకీయ ఎన్నికల్లో నిలబడడానికి ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటించకపోతే వాళ్లు కొనసాగుతున్న పదవీకాలంలో దిగజారుడుతనాన్ని ప్రదర్శించినట్లేనని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పార్లమెంటు స్థానంలో గాని అసెంబ్లీ స్థానంలో గాని రాజకీయ పదవిలో కొనసాగుతున్న రాజకీయ నాయకులపై ప్రజలకు గాని ప్రజా సంఘాలకు గాని ఉద్యమకారులకు గాని మేధావులకు గాని సాధారణ ప్రజలకు గాని జర్నలిస్టులకు గాని పూర్తిస్థాయిలో ప్రశ్నించే, విమర్శించే,నిలదీసే హక్కులు ఉంటాయని అవన్నీ రాజ్యాంగబద్ధంగా చట్టబద్ధంగా న్యాయస్థానాల రూపంలో దేశ ప్రజలకు కల్పించబడిన హక్కులని ప్రస్తుతం దేశవ్యాప్తంగా వాటన్నిటిని కాలరాస్తున్న ప్రతి రాజకీయ నాయకుడు రాజకీయ జవాబుదారీతనానికి దూరంగా ఉంటున్నారని భావించాల్సి ఉంటుందన్నారు.కొంతమంది నాయకులు ప్రజాసేవను సొంత కుటుంబ సేవగా భావిస్తారని అలాంటివాళ్లు ప్రజలకు సమర్థవంతమైన జవాబుదారీతనాన్ని అందిస్తారన్నది మాత్రం వాస్తవం అన్నారు.దేశంలో కురవడుతున్న రాజకీయ విలువలను కాపాడుకొండంటూ పిలుపునిచ్చారు.

# వికలాంగురాలికి అండగా మంత్రి

**వినతిపత్రం అందగానే సమస్యపై వెంటనే స్పందించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశాలు**
**సమస్యను సానుభూతితో విని ధైర్యం చెప్పిన మంత్రి**
**దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం**
**మంత్రి స్పందనకు బాధితురాలు, ప్రజల నుంచి ప్రశంసలు**

హైదరాబాద్, జూలై 13 (జై భీమ్ న్యూస్) :



రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు-వృద్ధులు-ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తన చాంబర్‌కు వినతిపత్రంతో వచ్చిన ఓ వికలాంగురాలి సమస్యపై వెంటనే స్పందించారు. బాధితురాలి సమస్యను శ్రద్ధగా ఆలకించిన మంత్రి, సంబంధిత జిల్లా కలెక్టర్‌తో తక్షణమే మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో పాటు సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన సూచనలు చేశారు. మంత్రి తక్షణ స్పందనపై వికలాంగురాలు ఆనందం వ్యక్తం చేస్తూ, తన సమస్యను సానుభూతితో విని వెంటనే చర్యలు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఆప్యాయంగా పలకరించిన మంత్రి ధైర్యం చెప్పడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, వారి సమస్యలను అధికారులు ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ప్రజా సమస్యలపై మంత్రి చూపిన మానవత్వం, తక్షణ స్పందనను అక్కడికి వచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE



# వరంగల్ పోలీస్ శాఖలో పెరుగుతున్న క్రీడా స్ఫూర్తి





**క్రీడా స్ఫూర్తికి డోకా లేదు.**
**క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.**
**రాష్ట్ర పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ ప్రతిభను కనపరిచారు.**
**బాక్సింగ్ ఛాంపియన్స్ గా నిలవడం అభినందనీయం.**
**రాష్ట్ర పోలీస్ క్రీడలు అంటేనే ఎంతో ప్రత్యేకం.**
**ఐదవ స్టేట్ పోలీస్ మీట్ లో వరంగల్ పోలీసుల పథకాల పంట**
**రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చాటినా వరంగల్ స్పెషల్ పార్టీ పోలీస్ లు**
**ఓవరాల్ గా బాక్సింగ్లో ఛాంపియన్షిప్ కైవసం చేసుకున్న వరంగల్ పోలీస్ బాక్సింగ్ టీం.**
**క్రీడాకారులను అభినందించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత**

**వరంగల్ పోలీస్ శాఖ జై భీమ్:-**

రాష్ట్ర పోలీస్ క్రీడల్లో ప్రత్యేకతను కనపరుస్తున్న వరంగల్ పోలీస్ శాఖకు చెందిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా ఐపీఎస్ అభినందించారు.వరంగల్ పోలీసులు క్రీడల్లో రాణిస్తుండడం అత్యంత శుభ పరిణామమని పోలీస్ వర్గాలు అభినందనలు తెలియజేస్తున్నాయి.వరంగల్ పోలీస్ శాఖలో క్రీడల్లో పాల్గొంటున్న పోలీస్ క్రీడాకారులకు ప్రత్యేకమైన తర్ఫీదును ఇప్పించగలిగితే రానున్న కాలంలో అత్యంత విలువైన క్రీడా స్ఫూర్తిని కనపరిచి అన్ని రకాల బహుమతులను తీర్చుకోగలరని వరంగల్ పోలీస్ అధికారులు పోలీస్ సిబ్బంది ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు.క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవడం కోసం ఎంతో శ్రమించాల్సి ఉంటుందని అందులో పోలీస్ సిబ్బంది ఇటు విధులతో పాటు అటు క్రీడను అభివృద్ధి పరచుకోవాలని సమయస్ఫూర్తిని పాటిస్తూనే క్రీడలపై ఉన్నతమైన మమకారాన్ని పెంచుకోవాలని వరంగల్ పోలీసులు ఆశాబావాన్ని వ్యక్తపరుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించబడిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ స్పెషల్ పార్టీ పోలీసులు సత్తా చాటారు. మల్కాజ్గిరి కమిషనరేట్ లో ప్రారంభమమైన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీల్లో, క్రీడాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాలు బాక్సింగ్ విభాగంలో

**మహిళా విభాగం**

ఇ.జమున ఉమెన్ ఏ.ఎస్.ఐ కేజీ 75-80 విభాగం సిల్వర్ మెడల్. బి.శోభ రాణి ఉమెన్ ఏ.ఎస్.ఐ కేజీ 70-75విభాగం బ్రాంజ్ మెడల్. ఎన్.స్వర్ణలత రెడ్డి ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కేజీ 80-85విభాగం బ్రాంజ్ మెడల్. ఎన్. సుజాత ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కేజీ 65-70 బ్రాశీజ్ మెడల్.స్వర్ణ భారతి ఉమెన్ పిసి 50-55 విభాగం గోల్డ్ మెడల్. దివ్య శ్రీ ఉమెన్ పిసి కేజీ 55-60 విభాగం గోల్డ్ మెడల్.సుష్మ ఉమెన్ పిసి కేజీ 45-50 విభాగం బ్రాంజ్ మెడల్. సౌజన్య ఉమెన్ పిసి కేజీ 45-50 విభాగం బ్రాంజ్ మెడల్స్ ని సాదించారు.

**పురుషుల విభాగం**

హన్మకొండ అజయ్ కుమార్ ఏఆర్ పిసి కేజీ 65-70 విభాగం సిల్వర్ మెడల్.బి.దేవప్రసాద్ ఏఆర్ పిసి కేజీ 85-90 విభాగం సిల్వర్ మెడల్.సిహెచ్.మహేందర్ యాదవ్ ఏఆర్ పిసి కేజీ 80-85 విభాగం బ్రాంజ్ మెడల్. జి.హరీష్ ఏఆర్ పిసి కేజీ 50-55 విభాగం బ్రాంజ్ మెడల్ సిహెచ్. సాయికుమార్ ఏఆర్ పిసి కేజీ 70-75 విభాగం బ్రాంజ్ మెడల్.ఆర్.యోగేశ్వర్ ఏఆర్ పిసి కేజీ 60-65విభాగం బ్రాంజ్ మెడల్స్ ని సాధించారు. గెలిచిన క్రీడాకారుల పట్ల పోలీస్ అధికారులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.అలాగే పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ అభినందించారు.పోలీసులు శాంతి భద్రతల్లోనే కాదు క్రీడల్లో కూడా రాణించగలరని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుందని సీపీ తెలిపారు.

**క్రీడా ఆత్మగౌరవానికి ఆత్మీయులు..**

ఈ సందర్భంగా ఏఆర్ విభాగానికి చెందిన అడిషనల్ డీసీపీ వేముల శ్రీనివాస్ పోలీస్ క్రీడాకారులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ వరంగల్ పోలీస్ శాఖలో ప్రతిభావంతులైన పోలీస్ క్రీడాకారులను వెలుగులోనికి తీసుకొస్తూ రాష్ట్రవ్యాప్తంగా వరంగల్ పోలీస్ క్రీడాకారులను పరిచయం చేస్తుండడమే కాకుండా క్రీడా స్ఫూర్తిలో కావలసిన విజయాలను సాధించే విధంగా ప్రత్యేక చొరవ చూపిస్తూ పోలీస్ క్రీడాకారులకు అండగా నిలుస్తూ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణను ప్రత్యేక తర్ఫీదును ఇప్పించుటకు తెలంగాణ పోలీస్ బాక్సింగ్ కోచ్ నిరంజన్ సూచనలను, సలహాలను ఇప్పించి,పోలీస్ క్రీడల్లో ప్రదర్శించాల్సిన ప్రత్యేకమైన మెలుకువలను వరంగల్ పోలీస్ బాక్సింగ్ క్రీడాకారులకు ఇప్పించి పథకాలు సాధించే విధంగా సహాయపడినారని పథకాలు పొందిన క్రీడాకారులు ఎంతో గర్వంగా చెప్పుకుంటున్నారు.అతి తక్కువ కాలంలో పోలీస్ క్రీడాకారులను తయారు చేసి వాళ్లను రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొనే విధంగా ప్రోత్సహించి వాళ్ళలో ధైర్య సాహసాలు నింపుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ శాఖకు బాక్సింగ్ క్రీడలో అత్యున్నత ప్రతిభ కనబరిచే విధంగా సహాయపడగలిగిన ఏఆర్ విభాగానికి చెందిన అడిషనల్ డీసీపీ వేముల శ్రీనివాస్ ప్రత్యేక సహాయార్థంగా నిలవడం పట్ల పోలీస్ శాఖలో పలువిధాల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

**క్రీడా స్ఫూర్తి బలశీ ఏసిపి నాగయ్య**

క్రీడాకారులను ఎప్పటికప్పుడు శారీరకంగా ఫిట్ గా ఉండేందుకు ఉదయం సాయంత్రం క్రీడల పట్ల శ్రద్ధ వహింపజేసీ క్రీడాకారులను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ క్రీడాకారులకు పోటీ తత్వం వచ్చేలాగున వారికి క్రీడాలను ఆడిస్తూ వారిలోని ప్రతిభను బయటకు తీసి ఇంకా ఎలా మెరుగవాలనే కోణంలో క్రీడాకారులను తీర్చిదిద్దేవారు. వారు క్రీడలపట్ల ఎంతో అనుభవం ఉంది గనుక ఉదయం సాయంత్రం కటోరమైన సాధన చేపించి క్రీడాకారులను తీర్చిదిద్దేవారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వేముల శ్రీనివాస్,అడిషనల్ డిసిపి సురేష్ కుమార్,అడిషినల్ డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, అడిషినల్ డీసీపీ బాలస్వామి,ఏసీపీ నాగయ్య,ఏసిపి సురేంద్ర ఆర్ ఐ అడ్మిన్ స్పర్జన్ రాజ్, ఆపరేషన్స్ ఆర్.ఐ ఉదయ భాస్కర్,ఆర్.ఎస్.ఐ శరత్ కుమార్,ఆర్,ఎస్.ఐ రమేష్ అలాగే పోలీస్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.







## ఈనెల 26 న కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం?



**హైదరాబాద్:జులై 13 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొము రవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకు నే భక్తులకు దక్షిణ మధ్యరైల్వే త్వరలో తీపికబురు అందించ నుంది, కొమురవెల్లిలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న కొము రవెల్లి రైల్వే స్టేషన్‌ను ఈ నెల 26న కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, అధికారికంగా ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవం జరిగిన రోజు నుంచే ఈ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు ప్రారంభం అవుతాయని రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుండి కొమురవెల్లి మీదుగా సిద్దిపేటకు ప్రతిరోజూ ఉదయం, మధ్యా హ్నం పూట రెండు రైళ్లు నడుస్తాయ న్నారు. అదేవిధంగా తిరుగు ప్రయాణంలో సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం, సాయం త్రం వేళల్లో మరో రెం డు రైళ్లు అందుబాటు లో ఉంటాయన్నారు. భవిష్యత్తులో భక్తుల రద్దీని బట్టి రైళ్ల సంఖ్య ను పెంచేందుకు, నిర్ణయం తీసుకుంటా మన్నారు. స్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయాలను మెరుగుపరిచేందుకు రైల్వే శాఖలోని మూడు విభాగాల అధికారులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో ప్రయా ణికుల అవసరాలపై దృష్టి సారించనుంది. ప్రస్తుతం ఈ మార్గంలో సికింద్రాబాద్ - సిద్దిపేట ప్యాసింజర్,డెమో రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. భవిష్యత్తులో ఈ లైన్‌ను కరీంనగర్, కాజీపేట మార్గాలకు అనుసంధానించడం ద్వారా మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపే అవకాశం ఉంది. ఈ నూతన రైల్వే లైన్ ప్రధానంగా హైదరా బాద్, మేడ్చల్- మల్కాజ్‌గిరి, సిద్దిపేట, జనగామ, కరీంనగర్ జిల్లాల భక్తులకు ఎంతగానో ఉపయోగ పడనుంది. రాజధాని నగరం సికింద్రాబాద్ నుంచి నేరుగా కనెక్టివిటీ ఉండటం తోపాటు.. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు కూడా ప్రయాణం ఎంతో సులువు కానుంది. ముఖ్యంగా వీకెండ్స్, శ్రావణ మాసం, జాతరల సమయంలో ఈ జిల్లాల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేని సురక్షితమైన ప్రయాణ సదుపాయం లభించనుంది.

## ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణ కార్యక్రమంపై విస్తృత అవగాహన

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**




మండలంలోని పంతిని, పున్నేల్,ఐనవోలు గ్రామాల్లో ఓటరు జాబితా ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, ఓటర్లకు ఫారాల వినియోగం, నమోదు ప్రక్రియ,అర్హతలు,సవరణలు ఓటరు జాబితాలో వివరాల నవీకరణపై తహసీల్దార్ విక్రమ్ పూర్తి వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అయినవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్,బొల్లెపెల్లి రఘు, అయినవోలు 170వ బూత్ బీఎల్ఏ తాటికాయల ప్రశాంత్, పున్నేల్ బీఎల్ఏ ఎడ్ల జగన్ ఓటర్ల నుంచి తీసుకున్న ఎస్ఐఆర్ ఫారాలను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా తిరిగి అందజేయాలని సూచించారు. ఫారాలు నింపడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత బీఎల్ఏలు మరియు బీఎల్ఓలు పూర్తి సహకారం అందించి ఫారాలను సక్రమంగా నింపేందుకు సహాయం చేస్తారని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన ఫారాలను సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు.

## 15న మహా ధర్నాను జయప్రదం చేయండి

**సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మంద సంపత్**

**హన్మకొండ, జూలై 13 2026(జై భీమ్ న్యూస్)**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు ) సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మంద సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ మండల కమిటీ సభ్యుడు ఇస్లావత్ రవీందర్ తో కలిసి జూలై 15న జరిగే నిరుద్యోగుల మహా ధర్నా కరపత్రాలను పబ్లిక్ గార్డెన్ వద్దనున్న జిల్లా గ్రంథాలయ సంస్థలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంద సంపత్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కాయని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చడం లేదు అన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు పది లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఉన్న 20000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ , జేఎల్ , డిఎల్, గ్రూప్-1 ,2, 3, 4 తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వరకు 5000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ను యూత్ డిక్లరేషన్ను అమలు చేయాలని కోరారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు . ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 15న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే మహా ధర్నాలో నిరుద్యోగ యువత వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

**కాజీపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు.. బంధువుల ఆచూకీ కోసం పోలీసుల గాలింపు**

**కాజీపేట, 13 జూలై 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. రోడ్డుపై అపస్మారక స్థితిలో కనిపించిన వ్యక్తిని స్థానిక యువకుడు అప్రమత్తంగా స్పందించి ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన పిల్లిశ్రీ రాంచరణ్ (18), ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో వెంకటాద్రి నగర్ రోడ్ నెం.4 మూల మలుపు వద్ద తన పెంపుడు కుక్కను తిప్పడానికి వెళ్లాడు. ఆ సమయంలో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుపై స్పృహలేని స్థితిలో పడివుండటాన్ని గమనించాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే రోజు మధ్యాహ్నం 2.24 గంటలకు వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో క్రైం నం.178/2026గా నమోదు చేసి, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్-194 కింద అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, మృతుడి గుర్తింపు, బంధువుల ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గుర్తుతెలియని మృతుడికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే కాజీపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

**అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: మంత్రి కొండా సురేఖ**



**హన్మకొండ, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వివిధ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సోమవారం హనుమకొండలోని రోడ్లు--భవనాల (ఆర్అండ్బీ) అతిథి గృహంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి అభివృద్ధి కార్యక్రమాలు, శాఖల సమన్వయం, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, మహిళల భద్రత, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు సేవలు అందించాలని మంత్రి సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, నగర పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చర్యల పురోగతిని మంత్రి సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని, పనిచేయని విద్యుత్ దీపాలను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సమీకృత కూరగాయలు--మాంసాహార మార్కెట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాబోయే బోనాల పండుగ సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కంట్రోల్ సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసులు

**విద్యార్థిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత**




**కాజీపేట, 13 జూలై 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కంట్రోల్ రూమ్ నుంచి అందిన సమాచారంపై వెంటనే స్పందించిన సిర్ప్ (ఎస్ ఐ.ఆర్.పి) కాజీపేట పోలీసులు, రైల్వే రక్షణ దళం (ఆర్పిఎఫ్) సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, రైలులో వెళ్లిపోయిన ఓ మైనర్ విద్యార్థినిని క్షేమంగా గుర్తించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో ప్లాట్‌ఫాం విధుల్లో ఉన్న సిర్ప్ కాజీపేట సిబ్బందికి కంట్రోల్ రూమ్ నుంచి సమాచారం అందింది. హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కాలేజీ, ఎస్.ఆర్. నగర్ బ్రాంచ్‌లో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రత్యేక్ష పూర్వి (16) అనే విద్యార్థిని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో కొంగు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కి, కళాశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా వెళ్లినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న వెంటనే సిర్ప్ కాజీపేట పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకున్న కొంగు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును క్షుణ్ణంగా తనిఖీ చేయగా విద్యార్థిని క్షేమంగా గుర్తించారు. విద్యార్థినిని విచారించగా, చదువుపై ఆసక్తి లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపింది. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి, నారాయణ జూనియర్ కాలేజీ యాజమాన్యం, తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో విద్యార్థినిని సురక్షితంగా అప్పగించారు. కంట్రోల్ సమాచారం మేరకు సకాలంలో స్పందించి మైనర్ విద్యార్థినిని క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన సిర్ప్ కాజీపేట పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బంది సేవలను అధికారులు అభినందించారు.

## మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**హన్మకొండ, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేత సోమవారం హన్మకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు సమర్థవంతమైన పోలీసింగ్ అందించడంలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కూడా పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలు, శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవల అందింపు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. ప్రజలకు జవాబుదారీతనం కలిగిన, పారదర్శకమైన పాలన అందించేందుకు అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లాల అభివృద్ధి, ప్రజా భద్రత, మహిళల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చ జరిగినట్లు అధికారులు తెలిపారు.

## ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి: సర్పంచ్ రఘువంశీ

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు అందించాలని సర్పంచ్ గడ్డం రఘువంశీ గౌడ్ అన్నారు.

సోమవారం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు నశించి, రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం విధిగా మాత్రలను తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల వైద్యాధికారి శ్రీదేవి, వైద్య సిబ్బంది కేజీబీవీ స్కూల్, ఎస్ వో సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు




## కాకతీయ విశ్వవిద్యాలయంలో అమెరికా ప్రొఫెసర్ విస్తృత ఉపన్యాసం


**'డిప్లాయబుల్ రోబోటిక్స్ దట్ లెర్న్' అంశంపై జూలై 14న ప్రత్యేక సదస్సు**




**హన్మకొండ, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రత్యేక విస్తృత ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జూలై 14వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగంలోని శ్రీనివాస రామానుజం సెమినార్ హాల్‌లో అమెరికా సంయుక్త రాష్ట్రాల జార్జ్ మేసన్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ శ్యుయేసు ష్యావ్ "డిపాలోయబుల్ రోబోటిక్స్ దట్ లెర్న్" అనే అంశంపై ఉపన్యాసం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (కో-ఎడ్యుకేషన్), మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కంప్యూటర్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించబడుతోంది. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు ఆధునిక రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో జరుగుతున్న తాజా సాంకేతిక పరిణామాలు, పరిశోధనలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, సాంకేతిక రంగాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## హసన్‌పర్తిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. నలుగురు అరెస్ట్




**హసన్‌పర్తి, 13 జూలై 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ వింటేజ్ వెనుక ఉన్న బహిరంగ ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించగా, అక్కడ పేకాట ఆడుతున్న మౌటం రమేష్, శీలం రవి, పెద్దమ్మ రమేష్, పిట్టల సాగర్ (అందరూ హసన్‌పర్తి పరిసర ప్రాంతాల నివాసితులు)ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో నిందితుల వద్ద నుంచి రూ.16,380 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఇటువంటి కార్యకలాపాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కేయూ అంబేద్కర్ స్టడీస్ ఇన్‌చార్జిగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్

**హన్మకొండ, 13 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్‌కు ఇన్‌చార్జి సంయుక్త సంచాలకులుగా బయోటెక్నాలజీ విభాగం ల్యాబ్ అసిస్టెంట్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌ను నియమిస్తూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నియామకం అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో తెలిపారు. డాక్టర్ పుల్లా శ్రీనివాస్ 2002లో కాకతీయ విశ్వవిద్యాలయంలో బుక్ కీపర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, 2011లో ల్యాబ్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2010లో విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. అంతేకాకుండా 2009 నుంచి కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్సీ/ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. డాక్టర్ పుల్లా శ్రీనివాస్ నియామకాన్ని పురస్కరించుకుని విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.



# ప్రజా భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డితో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానా భేటీ




**ఎస్సీల అభివృద్ధి, విద్యా సంస్కరణలపై విస్తృత చర్చ**
**కుల వివక్ష నిర్మూలనకు కీలక చర్యలు చేపట్టాం: సీఎం రేవంత్ రెడ్డి**

**హైద్రాబాద్, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజా భవన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమం, విద్యా రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్‌కు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి వాటిని దశలవారీగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పాఠశాలల్లోనే అందించడంతో పాటు, రవాణా సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోందని వెల్లడించారు. ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వీలైనన్ని ఎక్కువ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్య అందరికీ సమానంగా చేరువ కావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే అధిక అవకాశాలు కల్పిస్తున్నామని, రాజకీయాలు, పాలన, ఇతర కీలక రంగాల్లోనూ వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ అమలు ద్వారా సామాజిక న్యాయం సాధించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఎస్సీల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందేలా జాతీయ ఎస్సీ కమిషన్ చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రతి ఓటరు సహకరించాలి

**తహసీల్దార్ పూజారి కిరణ్ కుమార్**

**హసన్‌పర్తి, 13 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**





ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా హసన్‌పర్తి మండలంలోని నాగారం గ్రామంతో పాటు హసన్‌పర్తి 10వ బూత్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచనల మేరకు నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ముగ్గు వేసి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేణికుంట్ల అశోక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేసి తగిన నిధులు కేటాయించకపోవడంతో అనేక గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా ఉండేలా బీఎల్ఓలు పారదర్శకంగా విధులు నిర్వహించాలని కోరారు. బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, గ్రామ స్థాయి నుంచే ఓటు హక్కును పరిరక్షించే బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. హసన్‌పర్తి 10వ బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హులైన ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ ఏజెంట్లు బీఎల్ఓల సహకారంతో పూర్తి చేస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ తెలిపారు. అర్హుల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, బీఎల్ఏలు పూర్తి సమయాన్ని కేటాయించి ఓటర్ల హక్కులను కాపాడాలని కోరారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, అనర్హులను తొలగించడం, అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టి ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రతి ఓటరు తప్పనిసరిగా ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పూజారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తన వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే బీఎల్ఓలను లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. నిర్దేశిత గడువులోపు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించి ప్రక్రియకు సహకరించాలని కోరారు. బీఎల్ఓలు, బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు, సర్పంచుల ఫోరం జిల్లా కన్వీనర్ చల్లా రాకేష్ రెడ్డి, బ్లాక్ ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగిలపల్లి తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలు బత్తుల స్వాతి, బుచ్చిరెడ్డి, బండారి మొగిలి, లింగారెడ్డి, బర్ల రవి, సునీల్, దేవేందర్, మల్లాడి తిరుపతి రెడ్డి, మేకల శంకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

**హైదరాబాద్,జులై13(జై భీమ్ న్యూస్):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఎఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల పక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# జక్కిడి శివచరణ్ రెడ్డి ఇంటిపై దాడి యత్నం ఖండనీయం

**దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: యూత్ కాంగ్రెస్ నేత మాదాసి శ్రీధర్**



**పరకాల, 13 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి నివాసంపై జరిగినట్లు ఆరోపిస్తున్న దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జక్కిడి శివచరణ్ రెడ్డి రాజకీయ ఎదుగుదలను కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తూ, రాజకీయంగా దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అలాగే, ఎల్బీనగర్ నియోజకవర్గంలో టీఆర్ఎస్‌కు చెందిన గుండాలతో చేతులు కలిపి ఫేక్ రికార్డులు సృష్టిస్తూ జక్కిడి శివచరణ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డిలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిపై అసత్య ప్రచారాలు, బెదిరింపులు, దాడి యత్నాలను యువజన కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుందని, ఇటువంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని బాధ్యులను అరెస్టు చేయాలని మాదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆత్మకూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్‌తో పాటు తాళ్ల కిరణ్, సతీష్, రాజు, రాజ్‌కుమార్, శివ, రాజేందర్, వినయ్, క్రాంతి, శ్రీశైలం తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి: మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 13 (జై భీమ్ న్యూస్)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటీయూసీ) ఆధ్వర్యంలో భద్రాచలం నుంచి కొత్తగూడెం కలెక్టరేట్ వరకు చేపట్టిన మహా పాదయాత్రకు బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పలు హామీలు ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. ఎన్నో సంవత్సరాలుగా అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ, వారి న్యాయమైన సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడం బాధాకరమని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న 15 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఐసీడీఎస్‌కు తగిన బడ్జెట్ కేటాయించడం, ఎన్నికల హామీ మేరకు రూ.18,000 వేతనం అమలు చేయడం, అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, కనీస వేతనం రూ.26,000 చెల్లించడం, గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించడం, అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించడం, నాణ్యమైన రేషన్ సరఫరా చేయడం, అధికారులూ, రాజకీయ నాయకుల వేధింపులను నిలిపివేయడం వంటి అన్ని డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని తాటి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

## యూనిఫాంల కుట్టింపు ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్, 13 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి యూనిఫాం స్టిచ్చింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద చైర్మన్‌గా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) నాగ పద్మజ కన్వీనర్‌గా, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రంగయ్య నాయుడు సహ-కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత శాఖల అధికారులు సభ్యులుగా ఉంటూ యూనిఫాంల కుట్టింపు, నాణ్యత, పంపిణీ తదితర అంశాలను పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను సకాలంలో అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ యూనిఫాంల కుట్టింపు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీబీసీడీవో పుష్పలతతో పాటు వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# సంపూర్ణ ఆరోగ్యానికి నులిపురుగుల నివారణ మాత్ర తప్పనిసరి





**ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరు: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**

**హన్మకొండ, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం నులిపురుగుల నివారణ మాత్ర తప్పనిసరిగా వేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో మెరుగైన ప్రతిభ కనబరచగలరని అన్నారు. పిల్లలు అనారోగ్యానికి గురికావడం వల్ల పాఠశాలకు సక్రమంగా హాజరు కాలేకపోవడం, చదువులో వెనుకబడడం జరుగుతుందని తెలిపారు. నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాహారం సక్రమంగా అందడంతో పాటు పిల్లల ఎదుగుదల, బరువు, ఎత్తు పెరుగుదలకు దోహదపడుతుందని వివరించారు. కడుపులో నులిపురుగులు ఉంటే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, అందుకే ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఆల్బెండజోల్ మాత్రను నమిలి తీసుకోవడం వల్ల ఎలాంటి హానీ ఉండదని, భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, భోజనం చేసే ముందు మరియు మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, సమయానికి నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ కార్యక్రమం గురించి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారికీ అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయగా, విద్యార్థులు వాటిని నమిలి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ రజిత, డాక్టర్ ఎ. శ్రీకృష్ణారావు, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ సుమా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుబీనా, ప్రధానోపాధ్యాయులు రామారావు, స్థానిక వైద్యాధికారి డాక్టర్ గీత, డెమో వి. అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## డిగ్రీ విద్యార్థిని అనుమానాస్పద మృతి.. కాజీపేటలో కేసు నమోదు

**కాజీపేట, 13 జూలై 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 19 ఏళ్ల డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఘటనపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, హనుమకొండ నయీం నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న జుహేరియా (19) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఫిర్యాదుదారుడైన ఆమె సోదరుడు అమీర్ (21), తండ్రి షమీషుద్దీన్, కాజీపేట జూబ్లీ మార్కెట్ నివాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, వారి కుటుంబం గత నాలుగు నెలలుగా నయీం నగర్‌లో అద్దె ఇంటిలో నివసిస్తోంది. ఇటీవల జుహేరియా కాలేజీ నిర్వహించిన స్టడీ టూర్‌కు వెళ్లి మూడు రోజుల క్రితం తిరిగి వచ్చింది. అయితే కుటుంబ సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నయీం నగర్‌లోని ఇంటిని ఖాళీ చేసి, కాజీపేట జూబ్లీ మార్కెట్ ప్రాంతంలో మరో అద్దె ఇంటికి మారినట్లు తెలిసింది. ఈ విషయమై జూలై 12 రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు, జుహేరియాకు మధ్య వాగ్వాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి, ఇంటి మధ్య గదిలో సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు చున్నీతో వేలాడుతున్న స్థితిలో జుహేరియా కనిపించినట్లు తెలిపారు. వెంటనే బంధువుల సహాయంతో ఆమెను కిందికి దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆమె చేతులపై పలు కోసుకున్న గాయాలు ఉన్నట్లు కూడా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. మృతురాలి సోదరుడు అమీర్ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు కాజీపేట పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ బి. శివ క్రైమ్ నంబర్ 177/2026గా నమోదు చేసి, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, మృతికి గల అసలు కారణాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు.

## చింతగట్టు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మూడున్నర గంటల విద్యుత్ అంతరాయం

**ఉక్కపోతలో అల్లాడిన ప్రజలు.. తీవ్ర అసౌకర్యం**




**హసన్‌పర్తి, జూలై 13 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని చింతగట్టు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం విద్యుత్ సరఫరా సుదీర్ఘంగా నిలిచిపోవడంతో వేలాది మంది వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు సుమారు మూడున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇళ్లతో పాటు వ్యాపార సంస్థలు కూడా చీకట్లో మునిగిపోయాయి. విద్యుత్ లేకపోవడంతో ఉక్కపోతలో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇన్వర్టర్లు పనిచేయకపోవడం, తాగునీటి మోటార్లు నిలిచిపోవడం, వ్యాపార కార్యకలాపాలు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ సరఫరా ఎప్పుడు పునరుద్ధరిస్తారనే విషయంపై అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం అందకపోవడంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సుదీర్ఘ విద్యుత్ అంతరాయాలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ అంతరాయం, లోపాలు లేదా ఇతర సమస్యలపై వినియోగదారులు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారిక ఫిర్యాదు వ్యవస్థ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి మాధవి రావులపాటికి డాక్టరేట్

**హన్మకొండ, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని మాధవి రావులపాటికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ప్రకటించారు. మాధవి రావులపాటి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పెట్టుబడి మార్గాల పట్ల పెట్టుబడిదారుల అవగాహన -- ఒక అధ్యయనం అనే అంశంపై పరిశోధన నిర్వహించి డాక్టరేట్‌ను పొందారు. ఈ పరిశోధనను కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య వి.వి. సుబ్రమణ్య శర్మ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు. హనుమకొండకు చెందిన డాక్టర్ మాధవి రావులపాటి ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడిదారులు వివిధ ఆర్థిక పెట్టుబడి అవకాశాలపై కలిగి ఉన్న అవగాహన, పెట్టుబడి ఎంపికకు ప్రభావం చూపే అంశాలు, వారి నిర్ణయ విధానంపై ఆమె విస్తృత అధ్యయనం చేశారు. ఈ పరిశోధన గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అవగాహన పెంపొందించడానికి, పెట్టుబడి విధానాలపై మరింత స్పష్టత కల్పించడానికి ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. డాక్టరేట్ సాధించిన సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, సహచర అధ్యాపకులు మరియు విద్యార్థులు డాక్టర్ మాధవి రావులపాటిని అభినందిస్తూ ఆమె విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## భరోసా కేంద్రం సేవలను పరిశీలించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత





**వరంగల్, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సోమవారం రంగంపేటలోని భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ బాధితులకు అందుతున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించాలని, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, లైంగిక వేధింపులు, గృహ హింస వంటి ఘటనల బాధితులకు ఒకే వేదికపై సమగ్ర సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కేసును నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా పోలీసు అధికారులు, కౌన్సెలర్లు, న్యాయ నిపుణులు, వైద్య సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. భరోసా కేంద్రం ద్వారా బాధితుల్లో ధైర్యం, నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్శనలో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, మహిళా పోలీస్ స్టేషన్--1 ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, భరోసా ఎస్ఐ కిరణ్మయి, కౌన్సెలర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణలో తోటి సిబ్బందికి స్ఫూర్తిగా నిలవాలి: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



**వరంగల్, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ఆరోగ్య పరిరక్షణలో పోలీస్ క్రీడాకారులు తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ పిలుపునిచ్చారు. ఇటీవల మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ఐదవ రాష్ట్ర స్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ తొలి క్లస్టర్ పోటీల్లో మొత్తం 61 పతకాలు సాధించి విశేష ప్రతిభ కనబరిచిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులకు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పతక విజేతలను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరఫున పాల్గొని అత్యధిక పతకాలు సాధించడం గర్వకారణమని అన్నారు. క్రీడాకారుల కృషి, అంకితభావం, క్రమశిక్షణ ఇతర పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పోలీసు విధులు ఎంత ఒత్తిడితో కూడుకున్నవైనా, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ వ్యాయామం, క్రీడలు, శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వారానికి కనీసం మూడు నుంచి నాలుగు రోజులు కొంత సమయాన్ని కేటాయించి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. క్రీడాకారులు తమ సహచర పోలీస్ సిబ్బందిని కూడా ఆరోగ్య పరిరక్షణ వైపు ప్రోత్సహించి స్ఫూర్తిదాయకంగా నిలవాలని కోరారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన ప్రతి క్రీడాకారుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రతిష్ఠను మరింత పెంచారని, భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, శ్రీనివాస్, బాలస్వామి, ప్రభాకర్ రావు, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ స్పర్జన్ రాజ్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి - ఫారెస్ట్ దాడులు నిలిపివేయాలి

**ఐటీడీఏ పీఓకు వినతిపత్రం.. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సీపీఐ(ఎంఎల్) నేతల డిమాండ్**

**ఇల్లందు, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎన్నేళ్లుగా సాగు చేస్తున్న పోడు రైతులకు భూ పట్టాలు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా గిరిజనులు, వలస ఆదివాసీలు, ఇతర గిరిజనులు, పేద రైతులు పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికీ, ఇప్పటికీ అనేక మందికి భూ పట్టాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు లేని పరిస్థితిని ఆసరాగా చేసుకుని అటవీ శాఖ అధికారులు రైతులను భూముల నుంచి బలవంతంగా వెళ్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పోడు సాగుదారులపై అటవీ అధికారులు దాడులు నిర్వహించడం, అక్రమ కేసులు నమోదు చేయడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. గతంలో పోడు రైతులపై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఫారెస్ట్ అధికారుల వేధింపుల నుంచి గిరిజన పేద రైతులకు రక్షణ కల్పించాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి మండలం చలమన్ననగర్, పాత గుండాలపాడు, దమ్మపేట మండలంలోని గుండుగులపల్లి, దురదపాడు, మొండివర్రె, అశ్వరావుపేట మండలంలోని రాళ్లవాగు, ఉడుములబండ, దుమ్ముగూడెం మండలంలోని గౌరారం, నారాయణరావుపేట, పెద్దర్లగూడెం తదితర గ్రామాల్లో దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూముల్లో అటవీ శాఖ అధికారులు ప్లాంటేషన్లు వేస్తూ రైతులను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించి, కొంతమందికి పట్టాలు లేవనే కారణంతో భూములను స్వాధీనం చేసుకుంటున్నారని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అటవీ శాఖ చర్యలను అడ్డుకునే రైతులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఆ హామీలు అమలు కాలేదని గుమ్మడి నరసయ్య, రంగారెడ్డి విమర్శించారు. పోడు రైతులను ఫారెస్ట్ అధికారుల వేధింపుల నుంచి కూడా రక్షించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోడు సాగుదారుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి, అర్హులైన రైతులకు భూ పట్టాలు మంజూరు చేయడంతో పాటు అటవీ శాఖ దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లాలోని పోడు సాగుదారులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద భిక్షం, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, కెచ్చెల కల్పన, జాటోత్ కృష్ణ, కంగాల కల్లన్న, బానోత్ ధర్మ, నాగేశ్వరరావు, వీరబాబు, రామారావు, లక్ష్మణరావు, ఆజాద్, దాసరి సాయన్న, మునిగేలా శివప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కమలాపూర్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం..

**విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**

**కమలాపూర్, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పబ్బు సతీష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమలాపూర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్. నాగరాజు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని, ఆల్బెండజోల్ మాత్రల ద్వారా వాటిని సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. స్థానిక సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ, పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన జీవనశైలి అలవర్చుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు మాట్లాడుతూ, నులిపురుగుల నివారణ కార్యక్రమం పిల్లల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైందని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్. నాగరాజు మాట్లాడుతూ, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలు జూలై 20న నిర్వహించే మాప్-అప్ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొని ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్వైజర్ అమృతమ్మ, సిబ్బంది మల్లిక, జమున, ఆశా కార్యకర్తలు ప్రేమలత, రేణుక, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించిన మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్

**హసన్‌పర్తి, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని స్థానిక మసీదు ఆవరణలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు ఆటల ఆధారిత, బాలకేంద్రిత, సురక్షిత, ఆనందదాయక, సమగ్ర అభ్యసన విధానం ద్వారా విద్యను సులభంగా బోధించవచ్చని తెలిపారు. ప్రథమ తరగతిలో చేరే ముందు అవసరమైన పాఠశాల సిద్ధత నైపుణ్యాలను ప్రీ ప్రైమరీ తరగతుల్లోనే పిల్లలు అలవర్చుకుంటారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో చేర్పించాలని కోరిన ఆయన, ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎఫ్ఎల్ఎన్ మిషన్ ద్వారా మెరుగుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు నీరజ, దేవమ్మ, పున్నం చందర్, ప్రీ ప్రైమరీ టీచర్ శ్రావణి, సీఆర్పీ రాజ్‌కుమార్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు.. రైతులకు వెంటనే సాగునీరు అందించాలని డిమాండ్



**హన్మకొండ, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్, కన్నెపల్లి పంప్ హౌస్, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండున్నరేళ్లు దాటినా కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థపై సీఎం సరైన అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించాల్సిన సమయంలో రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును పక్కన పెట్టడం సరికాదన్నారు. మేడిగడ్డ గేట్ల అంశాన్ని ప్రస్తావిస్తూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహన లేమికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కన్నెపల్లి, దేవాదుల పంప్ హౌస్‌లను వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును మరమ్మతులు చేసి రైతుల అవసరాలకు వినియోగించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ నివేదిక పేరుతో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, రెండున్నరేళ్ల పాలనలో సాగునీటి విషయంలో ఒక్క కొత్త విజయాన్ని కూడా చూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, ప్రస్తుతం ప్రభుత్వం ఆ స్థాయిలో ఒక్క ఎకరానికైనా నీరు అందించిందా అని ప్రశ్నించారు. అదేవిధంగా సీఎం చేసిన వ్యాఖ్యల్లో హింసాత్మక పదజాలం ఉండడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా మాట్లాడాలని, ప్రతిపక్షాలను బెదిరించే విధంగా మాట్లాడటం తగదని విమర్శించారు. రైతుల పంటలు ఎండిపోకుండా వెంటనే కన్నెపల్లి, దేవాదుల మోటార్లను నడిపించాలని, లేకపోతే ఎండిన పంటలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు సాగునీరు అందించాలని కోరితే హింసను ప్రేరేపించే విధంగా ముఖ్యమంత్రి మాట్లాడడం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. సీఎం వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించబడాలని, రైతులకు తక్షణమే సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**వరంగల్, 13 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కలిసి సోమవారం సి.కె.ఎం. కళాశాల ఆవరణలోని దేశాయిపేట ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలో ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మాత్రలు నులిపురుగుల నివారణతో పాటు పిల్లల్లో రక్తహీనతను తగ్గించడం, పోషకాహార శోషణను మెరుగుపరచడం, ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని అధికారులు వివరించారు. ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఐ. ప్రకాష్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ రోజు 1,83,038 మంది పిల్లలకు (93.26 శాతం) ఆల్బెండజోల్ మాత్రలను మింగించినట్లు తెలిపారు. మిగిలిన పిల్లలకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ రౌండ్‌లో మాత్రలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. సాజిదా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, స్థానిక వైద్యాధికారి డా. భరత్ కుమార్, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్న, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కిరాతక రాజ్‌కుమార్ అంత్యక్రియలపై సందిగ్ధత

**రంగారెడ్డి,జులై13(జై భీమ్ న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం కొత్తూరు సమీపంలో లభ్యమైంది. నిందితుడు మృతదేహానికి సంబంధించిన పోస్టుమార్టం పక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో అంత్యక్రియలపై సందిగ్ధత నెలకొంది. ఈ కేసులో మృతురాలు సరిత తల్లిదండ్రులు కీలక డిమాండ్లు చేస్తున్నారు. తమ గ్రామంలోనే రాజ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించాలని, అలాగే తమ కుమార్తె సరిత, ఇద్దరు మనవళ్ల సమాధుల కాళ్ల వైపు రాజ్‌కుమార్‌ను సమాధి చేయాలని కోరుతున్నారు. అయితే ఈ ప్రతిపాదనను రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదు. మరోవైపు రాజ్‌కుమార్ స్వగ్రామమైన షాబాద్‌లో కూడా అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్థులు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నిందితుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులు నేరుగా చేవెళ్ల శ్మశానవాటికలోనే దహనం చేయాలని నిందితుడి తల్లిదండ్రులు, సోదరుడు కోరుతున్నట్లు సమాచారం. నిందితుడు రాజ్‌కుమార్ భార్య సరిత తల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తన కుమార్తె, ఇద్దరు మనవళ్లను రాజ్‌కుమార్ దారుణంగా హత్య చేశాడని తెలిపారు. పోలీసులు జేసీబీతో గుంతలు తీసి వారిని ఖననం చేశారని చెప్పారు. అదేవిధంగా రాజ్‌కుమార్‌ను కూడా తమ కుమార్తె, మనవళ్ల సమాధుల కాళ్ల వైపు ఖననం చేయాలని కోరారు. వేరే ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించవద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

# మళ్లీ బిజీగా మారిన నటి లయ

**వదలను సినిమా 17న విడుదల**



అందాల నటి లయ 'భద్రం కొడుకో' చిత్రంతో బాలనటిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 'స్వయంవరం'తో హీరోయిన్ గా ఎదిగింది. ఫస్ట్ ఇన్నింగ్స్ లో పలు అర్థవంతమైన చిత్రాలలో నటించిన లయ... ఉత్తమ నటిగా నంది అవార్డులు అందుకుంది. అయితే ఆ తర్వాత వివాహానంతరం అమెరికాకు వెళ్ళిపోవడంతో కొన్నేళ్ళు నటనకు దూరంగా ఉంది. ఆ మధ్య రవితేజ 'అమర్ అక్బర్ ఆంథోని' మూవీలో తన కూతురుతో కలిసి మెరుపులా మెరిసన లయ... గత యేడాది 'తమ్ముడు' సినిమాతో రీ-ఎంట్రీ ఇచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఆ సినిమా లయ అక్కగా నటించింది. కానీ ఆ సినిమా నిరాశ పర్చింది. ఆ తర్వాత తనకు బాగా కలిసి వచ్చిన శివాజీ సరసన లయ 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' చిత్రంలో నాయికగా నటించింది. కానీ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. గతంలో జగపతిబాబు సరసన 'మనోహరం'లో నటించి మంచి పేరు తెచ్చుకున్న లయ ఇప్పుడు మరోసారి ఆయనతోనే 'వదలా' చిత్రంలో చేస్తోంది. హృతికా శ్రీనివాస్ కీలక పాత్ర పోషించిన 'వదలా' హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాను ఆకెళ్ళ వి కృష్ణ తెరకెక్కించాడు. మూడు వారాల క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమాకు మరింత మెరుగులద్ది జూలై 17న విడుదల చేస్తున్నట్టు జగపతి బాబు తెలిపారు. విశేషం ఏమంటే... గతంలో శ్రీకాంత్ సరసన పలు చిత్రాలలో నటించిన లయ ఇప్పుడు 'మిస్టర్ మిడిల్ క్లాస్'మూవీలో హీరోయిన్ గా నటించింది. ఇందులో రాజేంద్ర ప్రసాద్ వేంకటేశ్వర స్వామిగా నటిస్తున్నారు. ఈ సోషియో ఫాంటసీ మూవీని జి. నాగేశ్వరరెడ్డి డైరెక్ట్ చేశారు. ఈ సినిమా కూడా జూలై 17నే రాబోతోంది. ఇలా సెకండ్ ఇన్నింగ్స్‌లో లయ హీరోయిన్ గా నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం కాకతాళీయం. ఇదే విషయాన్ని 'వదలా' చిత్ర నిర్మాతల్లో ఒకరైన తమ్మారెడ్డి భరద్వాజ దగ్గర ప్రస్తావించినప్పుడు ఆయన చాలా స్పోర్టివ్‌గా ఈ అంశాన్ని తీసుకున్నారు. 'ప్రతి వారం ఐదారు సినిమాలు వస్తూనే ఉంటాయి. అందులో బాగున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. లయ నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం తప్పేమీ కాదు. నిర్మాతలం ఎవరి వీలును బట్టి వాళ్ళం సినిమాలు రిలీజ్ చేస్తుంటాం. ఏ సినిమా బాగుంటే అది ఆడుతుంది... అంతే!' అని అన్నారు. ఈ వీకెండ్‌లో ఎనిమిది చిత్రాలు విడుదల అవుతుండగా, అందులో లయవి రెండు సినిమాలు. మరి వీటిల్లో ఏయే సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతాయో చూడాలి.

# ఇండియా స్టోరీపై నీలినీడలు

కాజల్, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలు పోషించిన హిందీ సినిమా 'ది ఇండియా స్టోరీ'. ఈ నెల 24న ఈ సినిమా హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ విడుదల కాబోతోంది. చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సాగర్ బి షిండే కథను అందించి, నిర్మిస్తున్నారు. ఈ కోర్ట్ రూమ్ డ్రామా ప్రజలు తీసుకునే ఆహారాన్ని విషతుల్యం చేస్తున్న ఎరువుల నేపథ్యంతో రూపుదిద్దుకుంది. విషపూరిత పురుగు మందుల వ్యవసాయం, దాని వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం వంటి అంశాల ఆధారంగా దీనిని తెరకెక్కించారు. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనేది ఈ మూవీ ట్యాగ్ లైన్. ఇదిలా ఉంటే... తాజాగా విడుదలైన టీజర్ లో భారత వ్యవసాయం, పురుగు మందుల వినియోగం, ఆహార భద్రతపై ఇచ్చిన గణాంకాలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో ఆగ్రో కెమికల్ రంగానికి చెందిన ఓ ప్రముఖ సంస్థ సీబీఎఫ్‌సి (సెంట్రల్ బోర్డ్ ఫాఫ్ ఫిల్మ్ సర్టిఫికెషన్)ను ఆశ్రయించింది. ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చే ముందు వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరింది. ఈ మూవీ తాజా టీజర్‌లో శాస్త్రీయ ఆధారాలను చూపకుండా ప్రజలలో భయాందోళనలకు కలిగించేలా ఉందని ఫిర్యాదు దారులు పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారం వల్ల రైతులు, వ్యవసాయ రంగం, వ్యవసాయ ఉత్తత్తులపై ప్రభావం పడే ఆస్కారం ఉందని వారు సి.బి.ఎఫ్.సి.కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలుస్తోంది. అలానే ఈ సినిమాలో పేర్కొన్న అంశాలకు తగిన ఆధారాలు చూపించవలసిందని కోరుతూ నిర్మాతలకు ఇప్పటికే కోర్ట్ నోటీసులు ఇచ్చిందనే ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 24న విడుదల కావాల్సిన 'ది ఇండియా స్టోరీ'పై నీలినీడలు కమ్ముకున్నాయనిపిస్తోంది. ఈ చిత్రానికి నిశాంత్ భగవత్ సినిమాటోగ్రఫీ అందించగా, మంగేష్ ధాక్డే సంగీతం సమకూరుస్తున్నారు. ఆశిష్ మత్రే ఎడిటింగ్, షకీల్ అజ్మీ సాహిత్యం, అన్మోల్ భావే సౌండ్ డిజైనర్.



# ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై పుకార్లు

**అలాంటిదేమీ లేదంటూ టీమ్ వెల్లడి**

జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా జూలై 18న తారక్ కీలక ప్రకటన చేయనున్నారని, అభిమాన సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించ నున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారడంతో తాజాగా ఎన్టీఆర్ టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి విజయాన్ని అందుకున్న నేపథ్యంలో, అదే తరహాలో జూనియర్ ఎన్టీఆర్ కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారనే ఊహాగానాలు మరింత బలపడ్డాయి. గతంలో 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించడం, అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం కావడం వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వార్తలన్నింటికీ ఎన్టీఆర్ టీమ్ ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనతో చెక్ పడింది. టీమ్ విడుదల చేసిన ప్రకటనలో, జూలై 18న రాజకీయ ప్రకటన ఉంటుందంటూ ప్రచారంలో ఉన్న వార్తల్లో ఎలాంటి



నిజం లేదని స్పష్టం చేసింది. ఆ రోజు నిర్వహించబోయే కార్యక్రమం 'ఊరు వాడ' పేరుతో ఇప్పటికే ముందుగానే ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఒక సామాజిక కార్యక్రమమని వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా 'ఊరు వాడ' కార్యక్రమం లక్ష్యం, ఉద్దేశ్యం, విజన్‌ను ప్రజలకు పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. దీనికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలిపింది. 'ఊరు వాడ' కార్యక్రమానికి సంబంధించిన వేదిక, సమయం, పూర్తి కార్యాచరణ వివరాలను త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా వెల్లడిస్తామని టీమ్ పేర్కొంది. అలాగే మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, సోషల్ మీడియా ఖాతాలు ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేసింది. ఎలాంటి వార్తనైనా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే ప్రచురించాలని కోరుతూ, తప్పుడు ప్రచారం వల్ల అభిమానుల్లో అనవసర గందరగోళం ఏర్పడుతుందని తెలిపింది.

# 24న సందడి చేయనున్న 'జన నాయగన్'

**ఓవర్‌సీస్‌లో అన్‌కట్ వర్షన్ విడుదల**

ఏడు నెలల నిరీక్షణకు చెక్ పెడుతూ.. 'జన నాయగన్' జులై 24న సందడి చేయనుంది. విజయ్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. బోర్డు చెప్పిన మార్పులను చేసి చిత్రబృందం దీన్ని విడుదల చేసేందుకు సిద్ధమైంది. అయితే ఓవర్సీస్‌లో మాత్రం ఈ సినిమా అన్‌కట్ వెర్షన్ విడుదల కానుంది. భారత్‌లో పలు కట్స్ విధించినప్పటికీ, యూకే లో మాత్రం ఈ చిత్రం ఎలాంటి కట్స్ లేకుండా ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్కడ ఈ సినిమాను ఎలాంటి మార్పుల్లేకుండానే విడుదల చేసేందుకు అనుమతి లభించింది. ఇక విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి కావడంతో సినిమా టైటిల్ కార్డులోనూ మార్పు చేశారు. గతంలో దళపతి విజయ్ అనే టైటిల్ కార్డు.. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌గా మారనుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 12 మార్పులు సూచించి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. విజయ్ (నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను తొలగించడంతో పాటు కొన్ని పదాలను మ్యూట్ చేయాలని.. మరికొన్ని సన్నివేశాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో త్వరలోనే దీని రిలీజ్ ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.







# మహేశ్‌బాబు కుటుంబంలో పెళ్లి సందడి

**కొరియన్ అమ్మాయితో సిద్దార్థ్ గల్లా నిశ్చితార్థం**

సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు సిద్దార్థ్ గల్లా త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. కొరియాకు చెందిన యువతి హాయిన్ (జిన్నీ)తో ప్రేమలో ఉన్న సిద్దార్థ్, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ శుభకార్యానికి మహేష్ బాబు కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు హాజరై సందడి చేశారు. మహేష్ బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను షేర్ చేస్తూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోల్లో నమ్రతతో పాటు మహేష్ బాబు సోదరీమణులు, కుటుంబ సభ్యులు కనిపించారు. ముఖ్యంగా మహేష్ అన్న దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా అరుదుగా పబ్లిక్‌లో కనిపించే భారతి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో అభిమానులు ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు.

సిద్దార్థ్ గల్లా ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు గల్లా జయదేవ్ మరియు పద్మావతి దంపతుల చిన్న కుమారుడు. ఆయన అన్న అశోక్ గల్లా ఇప్పటికే హీరోగా టాలీవుడ్‌లో అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం అశోక్ గల్లా నటిస్తున్న 'వీసా' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక సిద్దార్థ్ గల్లా మాత్రం సినీ రంగానికి దూరంగా ఉండి కుటుంబ వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కొరియన్ యువతి హాయిన్‌తో ప్రేమలో ఉన్న ఆయన, ఇప్పుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టబోతున్నారు.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM